క్లుప్తంగా

పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: పోలీసు అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా నగర కమిషనరేట్ పరిధిలో వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. సోమవారం నగర ఆర్మడ్ రిజర్వ్ మైదానంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరంలో పెద్ద సంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు. జోన్-1, జోన్-2, ట్రాఫిక్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. అలాగే సిబ్బందికి కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఒకటిన బహిరంగ వేలం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో పలు కల్యాణ మండపాలు అద్దెకిచ్చేందుకు నవంబర్ ఒకటిన బహిరంగ వేలం వేయనున్నట్టు జోన్ – 2 జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని ఆరిలోవ లాస్ట్ బస్టాప్ వద్ద కల్యాణమండపం, మారికవలస ఆర్‌జీకే కల్యాణ మండపం, ద్రోణంరాజు కల్యాణ మండపం అద్దెకిచ్చేందుకు ఆ రోజున ఉదయం 11 గంటలకు మధురవాడలో గల జోన్ – 2 జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు నిబంధనలకు లోబడి వేలంపాటలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అయ్యప్పలకు అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

అల్లిపురం: శ్రీ హరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కోదండ రామాలయం కమిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మండలకాల మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. వైర్‌లెస్ కాలనీ, శ్రీ కోదండరామాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఆరేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు కంచుమూర్తి వెంకటరమణమూర్తి, కె.శ్రీను తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు, గురుస్వామి కడగల శ్రీను, ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు యువకుడి అప్పగింత



సోదరుడికి కార్తీక్ రేని అప్పగిస్తున్న ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార : మానసిక సమస్యలతో బాధపడుతున్న కార్తీక్ రే అనే యువకుడిని సోదరుడు మత్యుంజయ్ రేకు ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు సోమవారం అప్పగించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా, పెదకొండ గ్రామానికి చెందిన కార్తీక్ పది రోజుల క్రితం స్నేహితులతో కలిసి వైజాగ్ వచ్చేశాడు. అక్కయ్యపాలెంలో మద్యం మత్తులో గొడవ చేయడంతో స్థానికులు కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసుకి సమాచారమివ్వడంతో ఆయన తీసుకెళ్లి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. సుమారు పదేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడని తెలుసుకుని శ్రద్ధ ఫౌండేషన్ సహకారంతో వారం రోజులపాటు చికిత్స అందించారు. అనంతరం కోలుకోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు నగరానికి వచ్చి కార్తీక్‌ను తీసుకెళ్లిపోయారు.

కొబ్బరి వ్యాపారానికి కల్పతరువు

- పూర్ణామార్కెట్‌లో జోరుగా వ్యాపారం
- నిత్యం లక్షన్నర కాయల అమ్మకం



పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో కొబ్బరికాయలు గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులు



దుర్గాలమ్మ గుడి జంక్షన్లో కొబ్బరికాయలు గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులు

డాబాగార్డెన్స్ : నారికేళం... శుభానికి సంకేతం.. పవిత్రతకు ప్రతిరూపం.. తప్పనిసరి కైంకర్యం.. ఇక ఆహారంగా కొబ్బరి ప్రాధాన్యం వర్ణనాతీతం. శుభకార్యమైతే కొబ్బరికాయ కొట్టాల్సిందే. ఆలయంలో అభిషేకానికి కొబ్బరి నీరు కావాల్సిందే. అమ్మ చేసే పచ్చడి రుచికి కొబ్బరి జత కట్టాల్సిందే. ఏవిధంగా చూసినా కొబ్బరి లేని జీవితం చప్పగా తెల్లారాల్సిందే. ఇంత కీలకపాత్ర పోషించే కొబ్బరి వ్యాపారానికి విశాఖ కొంగుబంగారంగా కళకళలాడుతోంది. ముఖ్యంగా నగరంలోని పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్ కొబ్బరి అమ్మకానికి పట్టుకొమ్మగా నిలుస్తున్నాయి. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే విక్రయాలు రెట్టింపవుతాయని వ్యాపారులు అంటున్నారు. నగరవాసులు మేల్కొనక ముందే పూర్ణామార్కెట్‌లో తొలిగా ప్రారంభమయ్యేది కొబ్బరికాయల వ్యాపారమేనని చెప్పుకోవచ్చు. కొబ్బరి అంటే మనకు గుర్తుకొచ్చేది కోనసీమ అయినప్పటికీ విక్రయాలు ఎక్కువగా సాగేది మాత్రం విశాఖలోనే. అందుకే ఆ ప్రాంతీయులు చాలా మంది నగరానికి తరలివచ్చి కొబ్బరి వ్యాపారంలో స్థిరపడ్డారు. వందేళ్ల చరిత్ర కలిగిన మార్కెట్‌లో వీరు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు.

రోజూ లక్షన్నర పైనే కాయల అమ్మకం

పూర్ణామార్కెట్‌లో రోజూ లక్షన్నరకు పైగానే కొబ్బరి కాయల అమ్మకాలు జరుగుతుంటాయి. శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట నుంచి అమలాపురం వరకూ అన్ని ప్రాంతాల నుంచి నిత్యం కాయలు వస్తుంటాయి. ఎక్కువగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి సరకు తీసుకొస్తారు. రాత్రి సమయానికి విశాఖ చేరుకుని వేకువనే లావాదేవీలు ప్రారంభిస్తారు. ఉదయం 7 గంటలకు అమ్మకాలు పూర్తవుతాయి. ఈ విధంగా రోజుకు పదిహేను నుంచి 20 వ్యానుల ద్వారా లక్షన్నరకు పైగా కాయల అమ్మకాలు జరుగుతాయి. పండగ సమయాల్లో అమ్మకాలు రెట్టింపవుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

సీజన్‌లో ఒకలా ధరలు..

అయ్యప్ప, భవానీ మాలలు ధరించే సమయాల్లో కొబ్బరి కాయల ధరలు బాగా పెరుగుతాయి. ప్రస్తుతం మాలధారణ కాలం కావడంతో మంచి ధరకే విక్రయాలు సాగుతున్నాయి. చిన్నకాయలు రూ.15 నుంచి రూ.20, ఓ మాదిరి కాయలు రూ.25 నుంచి రూ.35, పెద్దకాయలు రూ.40 పైమాటే అమ్ముతున్నారు. వీటిలో సగానికి పైగా దైవ కార్యాలకు, మిగిలిన వాటిలో ఎక్కువ హోటల్స్‌లో వినియోగిస్తున్నారు.

పండగల వేళ గిరాకీ

పండగ సమయాల్లోనే కొబ్బరి కాయల వ్యాపారం బాగుంటుంది. మిగిలిన రోజుల్లో ఒక్కోసారి అసలు ధర కన్నా తక్కువకు విక్రయించాల్సి వస్తుంది. గతంలో పూర్ణామార్కెట్‌లోనే అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఎన్ఏడీ, మద్దిలపాలెం, తదితర ప్రాంతాల్లో కూడా విక్రయిస్తుండడంతో పూర్ణామార్కెట్ కొంత కళ తప్పింది.

– చిన్నారావు, కొబ్బరికాయల వ్యాపారి

నిల్వ సౌకర్యం కల్పించాలి

కొన్నేళ్ల కిందట పూర్ణామార్కెట్‌లోనే కొబ్బరికాయలు విక్రయించేవాళ్లం. అనంతరం కొందరు రోడ్డుపైకి వచ్చి అమ్మకాలు ప్రారంభించారు. అప్పటి నుంచి అందరూ రోడ్డుపైకే వచ్చేసి విక్రయాలు జరుపుతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో సరకు నిల్వ చేసుకునేందుకు కనీస సౌకర్యాలు లేవు. ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి.

– సంతోష్, కొబ్బరికాయల వ్యాపారి

ప్రజలు వ్యతిరేకించే చోట మద్యం షాపులొద్దు



ఆందోళనకారులకు మద్దతుగా భూపేష్‌నగర్ వద్ద మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి

అల్లిపురం : ప్రజలు వ్యతిరేకించే చోట మద్యం షాపులు మూసేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, ఉపాధ్యక్షురాలు వై.సత్యవతి డిమాండ్ చేశారు. భూపేష్‌నగర్‌లో మద్యం షాపు వద్దంటూ చేపట్టిన ఆందోళనకు సోమవారం ఆమె మద్దతు తెలిపారు. 500 కుటుంబాలు నివసిస్తున్న భూపేష్‌నగర్ కాలనీ వద్ద మద్యం షాపు మూసివేస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని గత 11 రోజులుగా, పందిమెట్ట వద్ద తొమ్మిది రోజులుగా స్థానికులు ఆందోళన చేస్తున్నారన్నారు. అధికారులను కలిసి షాపులు ఎత్తివేయాలని కోరుతున్నారన్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికే ఎదురుగా గల బార్లలో తాగి వచ్చి తమ కాలనీలో అల్లరి చేస్తున్నారని, గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయని స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కూడా వారితో కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. వీధి మొదట్లోనే మద్యం దుకాణం పెడితే ఇళ్లలో నివాసముండలేమని స్థానిక మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇదేనా కూటమి ప్రభుత్వం మంచి పాలన అంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఐద్వా జగదాంబ జోన్ కార్యదర్శి ఆర్.వరలక్ష్మి, బేగం, ఎరుకమ్మ, లక్ష్మి, భారతి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

అల్లిపురం: బీచ్‌రోడ్డులో గంజాయి విక్రయానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని మహారాణిపేట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, నౌరంగాపూర్ జిల్లా, మంచగయాన్, బేడాపడార్ గ్రామానికి చెందిన బులు గుండా అనే వ్యక్తి మల్కన్‌గిరి నుంచి గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరు తీసుకువెళ్లేందుకు బయలు దేరాడు. రైల్వే స్టేషన్‌లో అతని పరసు పోవటంతో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి బీచ్‌రోడ్డులో గోకుల్ పార్కు వద్ద అమ్మేందుకు సిద్ధమయ్యాడు. అతడిని గమనించిన స్థానికులు మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని 5 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యూజీడీ కార్మికులకు పూర్తి వేతనాలివ్వాలి



టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న యూజీడీ కార్మికులు

సీతమ్మధార : భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) విభాగం కార్మికులందరికీ సమానంగా వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నేతలు కోరారు. ఈ మేరకు ద్వారకానగర్ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. యూజీడీ విధులు నిర్వహిస్తున్న 90 మందికి మాత్రమే జీవో 36 ప్రకారం రూ.24,500 వేతనం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. మిగిలిన 179 మంది కార్మికులకు తక్కువ వేతనాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు. చనిపోయిన కార్మికుల వారసులకు మూడేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారమివ్వాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని కోరారు. ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ఆదినారాయణ, యు.రాజు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి మేయర్



బస్సులో వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో కాలుష్యం నియంత్రణకు ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని కోరారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి.రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు ఆయన తెలిపారు. ఆర్వో బాబూరావు, ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోర్టులో విజిలెన్స్ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: విశాఖ పోర్టు అథారిటీ(వీపీఏ)లో విజిలెన్స్ వారోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పి.ఎస్.ఎల్.స్వామి, పోర్టు విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది సమక్షంలో పరిపాలన భవనంలో సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి సందేశాలను ఉన్నతాధికారులు చదివి వినిపించారు. అనంతరం పోర్ట్ సిబ్బంది సీహార్స్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వీపీఏ సిబ్బంది, వారి పిల్లల కోసం వక్తృత్వ, క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించడంతో పాటు పోర్టు భాగస్వామ్యంతో ప్రత్యేకంగా సమావేశాలను నిర్వహించనున్నారు.

'మంచి ప్రభుత్వం'లో ముక్కు మూసుకోవాల్సిందే..!



జీవీఎంసీ 42వ వార్డులో చెత్త కుప్ప పక్క నుంచి పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కూటమి నాయకులు, అధికారులు

డాబాగార్డెన్స్ : 'మంచి ప్రభుత్వం'లో ముక్కు మూసుకుంటేనే రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది... సాక్షాత్తూ ఎమ్మెల్యే వచ్చినా సరే దక్షిణ నియోజకవర్గంలో అదే దుస్థితి నెలకొందంటే క్షేత్రస్థాయిలో పారిశుధ్యం ఎంత అధ్వానంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా వార్డుల్లోని సమస్యలు ఒక్కటీ పరిష్కరించ లేదు. పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు.., వీధిలైట్లు వెలగకపోవడం.., తాగునీటి సరఫరాలో ఇబ్బందులు.., చిన్నపాటి వర్షానికే కాలువల్లోని మురుగు పొంగి ప్రవహించడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఇంటింటికీ వచ్చి 'మంచి ప్రభుత్వం' అంటూ స్టిక్కర్లు అంటించారని... సమస్యలు మాత్రం అలానే వదిలేశారని స్థానికులు మండిపడుతున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం జీవీఎంసీ 42వ వార్డులో పర్యటించారు. ఆ వార్డులోని ఓ గెడ్డ వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోవడంతో ఎమ్మెల్యే నివ్వెరపోయారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాగునీటికి నిత్యం నాణ్యతా పరీక్షలు



బర్మాకాలనీ బ్లాక్ 18 పంప్‌హౌస్ వద్ద అధికారులతో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్ : నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా నిత్యం నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎన్ రవితో కలిసి బర్మాకాలనీలో గల బ్లాక్ 18 నీటి సరఫరా పంప్ హౌస్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బర్మాకాలనీ పంప్ హౌస్ నుంచి సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించారు. రోజూ ఎన్ని శాంపిల్స్ పరీక్షిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం సమీపంలోని ఓ ఇంటి వద్ద వ్యక్తిగత కుళాయిలో వస్తున్న నీటిని కమిషనర్ పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల వద్ద నీటి సరఫరా విభాగం, ఏజెన్సీలతో పరీక్షలు జరిపి రోజుకి 300 ఎంఎల్‌డీ తాగునీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీరు పరీక్షించేందుకు మొబైల్ టెస్ట్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదించామని తెలిపారు. కాలువల వద్ద కలిసే పైప్‌లైన్లు మార్పించామని, లీకేజీలు గుర్తించి అరికట్టామన్నారు. వ్యక్తిగత కుళాయి కనెక్షన్ కలిగిన నివాసితులు జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఇష్టానుసారం పార్కింగ్ చేస్తే చర్యలు



శ్రీనగర్‌లో పరిశీలిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ ప్రసాద్

సీతమ్మధార : ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఇష్టానుసారం పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎన్.వి.ప్రసాద్ హెచ్చరించారు. ఆయన సోమవారం స్టేషన్ పరిధిలో గల శ్రీనగర్, రామాటాకీస్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించారు. రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో బస్సులు నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డుపై ప్రయాణికుల కోసం అధిక సమయం పార్కింగ్ చేయరాదని కోరారు. అలాగే బస్టాపుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఆపొద్దని సూచించారు. ఈ సందర్భంగా రామాటాకీస్ రోడ్డులో గల ప్రైవేట్ ట్రావెల్ బస్సు యాజమాన్యాలతో సమావేశమయ్యారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కి ఆటంకం కలిగించొద్దని కోరారు. ఆయనవెంట ద్వారకా స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత గ్యాస్‌కు కొర్రీలు

- తెల్లరేషన్ కార్డు ఉంటేనే ఉచిత గ్యాస్ సిలిండర్లు
- ఎన్నికల వేళ అందరికీ ఏడాదికి 3 సిలిండర్లు అన్న బాబు అండ్ కో
- మండిపడుతున్న మధ్య తరగతి మహిళలు
- నేటి నుంచి బుకింగ్స్ ప్రారంభం



మహారాణిపేట : కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి 'తెల్ల రేషన్ కార్డు ఉంటేనే' అంటూ నాడు లేని ట్యాగ్ నేడు తగిలించి ప్రజలను ఉసూరుమనిపించారు. తెల్ల రేషన్ కార్డు ఉంటేనే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దక్కనున్నాయి. తెల్ల కార్డు లేకపోతే అంతే సంగతులు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ మాటను మడత బెట్టారు. ఉచిత సిలిండర్లు రావాలంటే రైస్ కార్డు తప్పనిసరి అని మెలిక పెట్టారు. దీంతో మధ్య తరగతి మహిళలు తీవ్ర నిరాసకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ఒకలా ఇప్పుడు మరోలా కూటమి ప్రభుత్వం మాట్లాడుతుందని ధ్వజమెత్తుతున్నారు.

దీపావళి నుంచి అమలు

ఈనెల 29 నుంచి గ్యాస్ బుకింగ్ ప్రారంభిస్తున్నారు. పథకాన్ని దీపావళి నుంచి అమలు చేయనున్నారు. ఎల్పీజీ కనెక్షన్, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతలుగా నిర్ణయించారు. గతంలోలాగే బుకింగ్ చేసిన తర్వాత ఒక ఎస్ఎంఎస్ లబ్ధిదారుని ఫోన్‌కు వస్తుంది. 24 గంటల్లో పట్టణ ప్రాంతాల్లోను, 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయనున్నారు. డెలివరీ చేసిన 48 గంటల్లో డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాలో నేరుగా రాయితీ సొమ్ము జమ అవుతుంది.

సిలిండర్ల వివరాలు ఇవీ...

విశాఖ జిల్లాలో మొత్తం అన్ని సిలిండర్లు కలిపి 8,90,345 ఉన్నాయి. సింగిల్ సిలిండర్లు మొత్తం 2,24,604 ఉండగా, అర్బన్‌లో 2,21,616, రూరల్‌లో 2,988 సిలిండర్లు ఉన్నాయి. డబుల్ సిలిండర్లు జిల్లాలో మొత్తం 5,33,988 ఉండగా, రూరల్‌లో 39,356, అర్బన్‌లో 4,94,632 ఉన్నాయి. దీపం సిలిండర్లు మొత్తం 1,31,749 ఉండగా, రూరల్‌లో 7,632, అర్బన్‌లో 1,24,117 సిలిండర్లు ఉన్నాయి. వాణిజ్య అవసరాల నిమితం వాడే సిలిండర్లు మొత్తం 15,812 ఉండగా, రూరల్‌లో 182, అర్బన్‌లో 15,812 సిలిండర్లు ఉన్నాయి. ఉజ్వల్ సిలిండర్లు మొత్తం 17,320 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 5,12,619 తెలుపు కార్డుదారులు ఉన్నారు.

మూడు దఫాలుగా..

ఏడాదిని మూడు బ్లాక్ పీరియడ్లుగా పరిగణిస్తున్నారు. మొదటి దఫా అక్టోబర్ 31 నుంచి మార్చి 31లోపు తీసుకోవాలి. రెండోది ఏప్రిల్ ఒకటి నుంచి జులై 31లోపు, మూడోది ఆగస్టు 1 నుంచి నవంబర్ 30లోపు పొందవచ్చు. ఈ పథకంలో సమస్యలు ఎదురైతే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడానికి ఏర్పాట్లు చేశారు.

సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిద్దాం



జెట్టీని శుభ్రం చేస్తున్న జేడీ విజయ, తదితరులు

మహారాణిపేట : సముద్ర సంపదను మనమే కాపాడుకుందామని ఫిషరీస్ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ సూచించారు. ఫిషరీస్ శాఖ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎఫ్, గ్రీన్ క్లైమేట్ టీం, ఎన్‌జీవోలు ఫిషింగ్ హార్బర్‌లోని 10వ నంబరు జెట్టీని సోమవారం సాయంత్రం శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సముద్రంలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను జెల్లీ ఫిష్ అనుకుని చేపలు, తాబేళ్లు తిని మృతి చెందుతున్నాయన్నారు. సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు మనమే తొలగించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏపీ మెకనైజ్డ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగరావు మాట్లాడుతూ సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోకుంటే నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హనీ, జేవీ రత్నం, జె.రవితేజ, ముస్నం బాలాజీ, గరగయ్య పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్‌లో వ్యర్థాల తొలగింపు



పూర్ణామార్కెట్‌లో వ్యర్థాలు సేకరిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్ : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం, ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం సంయుక్తంగా 'దివాళి విత్ మై భారత్' కార్యక్రమాన్ని సోమవారం చేపట్టాయి. స్థానిక సర్దార్ వల్లభాయి పటేల్ (పూర్ణా మార్కెట్)లో చెత్త, వ్యర్థాలు తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, జిల్లా నెహ్రూ యువ అధికారి జి.మహేశ్వరరావు, ఏవీఎన్ కళాశాల ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డబ్బీరు గాయత్రి పాల్గొన్నారు.